క్లుప్తంగా

27న జాబ్ మేళా

మిర్యాలగూడ అర్బన్: పట్టణంలోని కేఎస్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 27న ఉదయం 10గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ భిక్షమయ్యగౌడ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివిధ పట్టణాలలో స్పందన స్ఫూర్తి ఫైనాన్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న బ్యాంకులలో ఫీల్డ్ ఆఫీసర్ ఉద్యోగాల కోసం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇంటర్మీడియట్ పూర్తిచేసిన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నాలుగు లీటర్ల సారా, నల్ల బెల్లం స్వాధీనం


బెల్లం పానకాన్ని పారబోస్తున్న ఎక్సైజ్ అధికారులు

దేవరకొండ: మండల పరిధిలోని బండమీది తండా, శక్రుతండా, మేగ్యతండాల్లో సోమవారం టాస్క్‌ఫోర్స్, ఎక్సైజ్, సివిల్ పోలీసులు దాడులు నిర్వహించారు.ఈ దాడుల్లో శక్రుతండాలో నాలుగు లీటర్ల సారా, 30కేజీల నల్లబెల్లం స్వాధీనం చేసుకొని 250లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చసినట్లు ఎక్సైజ్ సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఇద్దరిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. దాడుల్లో ఎస్ఐలు సూర్యప్రకాష్, వెంకటయ్య, సిబ్బంది ఉన్నారు.

మే డే వారోత్సవాలు ఘనంగా నిర్వహించాలి

దేవరకొండ: ప్రపంచ కార్మికుల దినోత్సవం మే డేను పురస్కరించుకొని మే 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. సోమవారం దేవరకొండలో ఏర్పాటు చేసిన సీఐటీయూ నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశానికి హాజరై ఆయన మాట్లాడారు. సీఐటీయూ నిరంతరం కార్మికుల పక్షాన పోరాడుతుందన్నారు. మే డేను కార్మికులు ఐక్యంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. రమావత్ సర్వన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి నల్ల వెంకటయ్య, నాయకులు రమావత్ జబ్బార్, బిజిలి లింగయ్య, జండయ్య, శ్రీను, లచ్చిరాం, సుగుణమ్మ, సాయిలు, రాజు, శంకర్ తదితరులున్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

హాలియా: బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సీడీపీఓ పద్మావతి అన్నారు. అనుముల ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో బేటీ బచావో-బేటీ బచావో కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ఎమ్మార్సీ జెడ్పీహెచ్ఎస్‌లో సోమవారం కిశోర బాలికలకు నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఎక్కడైనా బాల్య వివాహాలు చేస్తున్నట్లు తెలిస్తే 1098, 100, 181 టోల్‌ఫ్రీ నంబర్లకు సమాచారం ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో ఏడబ్ల్యూటీ వజ్రమ్మ, ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణారెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

నోట్ పుస్తకాలు అందజేత

మిర్యాలగూడ: దామరచర్ల మండలం గణేష్‌పహాడ్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు సోమవారం బంజారా మహిళ ఎన్జీఓ ఫౌండర్ డాక్టర్ ఆనంద్, అశ్విత ఉచితంగా నోట్ పుస్తకాలు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో గోబ్రియా, కిరణ్, నారాయణ, ఈసీ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కైరళి స్కూల్ విద్యార్థులకు రైల్వే అధికారుల ప్రశంస


ప్రశంసా పత్రాలతో కైరళి స్కూల్ విద్యార్థులు

మిర్యాలగూడ టౌన్: పట్టణంలోని బంగారుగడ్డలో గల కైరళి ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థులు ఈ నెల 8న వందే భారత్ రైలు మిర్యాలగూడకు వచ్చిన సందర్భంగా వివిధ రకాల నృత్యాలతో స్వాగతం పలకడంతో గుంటూరు డివిజనల్ రైల్వే శాఖ అధికారులు సోమవారం ప్రశంసా పత్రాలు పంపించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ షేక్ అహ్మద్ మాట్లాడుతూ.. వందే భారత్ రైలు సికింద్రాబాద్ నుంచి మిర్యాలగూడ రైల్వే స్టేషన్‌కు వస్తుండటంతో పాఠశాల విద్యార్థులు గంట పాటు ప్రదర్శించిన నృత్యాలు చేసినట్లు పేర్కొన్నారు. దీంతో గుంటూరు డివిజనల్ రైల్వే మేనేజర్ రామకృష్ణ విద్యార్థులను అభినందిస్తూ ప్రశంసా పత్రాలు పంపించడంతో స్థానిక రైల్వే స్టేషన్ మాస్టర్ సతీష్ విద్యార్థులకు అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రైల్వే అధికారులకు పాఠశాల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వరలక్ష్మి, రాజేష్, బాష, రాహుల్, విజయలక్ష్మి, మంజుల, రహీమున్నీసా తదితరులున్నారు.

ఆధునిక వసతులతో శ్మశానవాటిక

- మిర్యాలగూడ మున్సిపాలిటీలో ముమ్మరంగా కొనసాగుతున్న పనులు


మిర్యాలగూడ పట్టణంలోని షాబునగర్ హిందూ శ్మశానవాటికలో కొనసాగుతున్న పనులు

మిర్యాలగూడ టౌన్: పారిశ్రామికంగా రోజురోజుకు అభివృద్ధి చెందుతున్న మిర్యాలగూడ మున్సిపాలిటీలో 1,53,00 మందికి పైగా జనాభా ఉంది. ప్రస్తుతం పట్టణంలోని షాబునగర్-తాళ్లగడ్డ మధ్యలో వ్యవసాయ మార్కెట్ వెనుక గల హిందూ శ్మశానవాటికలో అనేక సమస్యలు తిష్టవేయడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన స్థానిక ఎమ్మెల్యే నలమోతు భాస్కర్‌రావు మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ సహకారంతో శ్మశానవాటికను నూతనంగా నిర్మించేందుకు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ మేరకు ఇన్ బడ్జెట్ గ్రాంటు కింద రూ.5.50 కోట్లు నిధులు మంజూరు చేయించారు. కాగా ఈ శ్మశానవాటికను పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో దహన సంస్కారాలకు ఇబ్బందులు కల్గకుండా తాత్కాలిక శ్మశానవాటికను ఏర్పాటు చేసి నిర్మాణ పనులు చేపట్టారు.

సకల వసతులతో..

ఐదెకరాల్లో నూతనంగా నిర్మిస్తున్న ఈ శ్మశానవాటికను హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో గల మహాప్రస్థానం శ్మశానవాటికను పోలి ఉండేలా ఆధునిక వసతులు ఏర్పాటు చేయనున్నారు. ఇందులో నాలుగు దహన వాటికలు, ఒక విద్యుత్ దాహన వాటిక, నాలుగు సిట్టింగ్ గ్యాలరీలు, టాయిలెట్ కాంప్లెక్స్ నిర్మించనున్నారు. వీటితో పాటు అద్దె ఇళ్లలో ఉన్నవారు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ప్రత్యేకంగా రెండు గదులు, దింపుడు కల్లంతో పాటు ఒక కార్యాలయం కూడా నిర్మిస్తున్నారు. అదేవిధంగా ఈ శ్మశానవాటికలో పార్కుతో పాటు ఇతర సుందరీకరణ పనులను కూడా చేపడుతున్నారు. త్వరితగతిన పనులు పూర్తిచేసి శ్మశానవాటిక ప్రజలు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషిచేస్తున్నట్లు మున్సిపల్ అధికారులు పేర్కొన్నారు.

జూన్ చివరి వరకు పూర్తి..

> నూతనంగా చేపట్టిన హిందూ శ్మశానవాటిక నిర్మాణ పనులను జూన్ నెల చివరి వరకు పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశాం. ప్రస్తుతం పనులు వేగంగా సాగుతున్నాయి. త్వరితగతిన పనులను పూర్తి చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుంటున్నాం.
>
> – వెన్నెల కుమార్, పబ్లిక్ హెల్త్ ఏఈ, మిర్యాలగూడ

కొనసాగుతున్న వీఓఏల సమ్మె


త్రిపురారంలో ఒంటి కాలిపై నిలబడి నిరసన వ్యక్తం చేస్తున్న వీఓఏలు

మాడుగులపల్లి: ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో వీఓఏలు(విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్స్) చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం ఎనిమిదో రోజూ కొనసాగింది. ఈ సందర్భంగా పలు పార్టీల నాయకులు సమ్మెకు మద్దతు తెలిపి మాట్లాడారు. వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. సకాలంలో వేతనాలు చెల్లించాలని, కనీస వేతనం రూ.26వేలకు పెంచాలన్నారు. కార్యక్రమంలో వీఓఏల సంఘం మండలాధ్యక్షురాలు జల్ల పుష్ప, కార్యదర్శి చిట్యాల దానియేలు, కోశాధికారి తండు సైదమ్మ, ఉపాధ్యక్షురాలు తుంగతుర్తి యాదమ్మ, సంయుక్త కార్యదర్శి చిలకమర్రి జ్యోతి, పావని, సంతోషి, సైదమ్మ, జానమ్మ పాల్గొన్నారు.

ఒంటి కాలిపై నిలబడి నిరసన..

త్రిపురారం: వీఓఏలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వీఓఏల సంఘం మండల అధ్యక్షుడు పడిశల సైదులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలో శ్రీనిధి కార్యాలయం ముందు వీఓఏలు ఒంటి కాలిపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పుష్పలత, కళ్యాణి, స్వామి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఉజ్జిని యాదగిరిరావు

చింతపల్లి: నల్లగొండ జిల్లా అభివృద్ధి చెందాలంటే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా చేపట్టిన డిండి లిఫ్టును త్వరగా పూర్తిచేసి దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాలకు నీరందించాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఉజ్జిని యాదగిరిరావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మండల పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. సీపీఐ జాతీయ సమితి పిలుపు మేరకు దేవరకొండ నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో మే 14 వరకు బీజేపీ హటావో-దేశ్ బచావో పేరుతో ఇంటింటికి ప్రజా చైతన్య యాత్ర చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం పెంచిన డీజిల్, పెట్రోల్, వంట గ్యాస్ ధరలను తక్షణమే తగ్గించాలని, కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి పోలె వెంకటయ్య, సహాయ కార్యదర్శి ఆరెకంటి రాధాకృష్ణ, శేఖరాచారి, ఇద్దిరాములు, నర్సింహ, వీరయ్య, బుచ్చయ్య, శ్రీకాంత్, సైదులు, రామకృష్ణ, వెంకటయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజల కోసం ఎంతైనా ఖర్చు పెడతా


జోడో యాత్రలో మాట్లాడుతున్న బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ: పేదల కోసం ఎంతైనా ఖర్చు పెడ్తానని కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బత్తుల లక్ష్మారెడ్డి (బీఎల్ఆర్) అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆయన చేపడుతున్న హాథ్ సే హాథ్ జోడో యాత్ర సోమవారం మిర్యాలగూడ మండలంలోని నాణ్యతండా, సామ్యతండా, బిల్లునాయక్ తండా, అన్నారం క్యాంప్, అన్నారం, గద్దగూడు గ్రామాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా బీఎల్ఆర్ మాట్లాడుతూ.. అధికార దాహంతో కొందరు కాంగ్రెస్ పార్టీకి ద్రోహం చేశారని, కష్టకాలంలో తాము కాంగ్రెస్ జెండాను భుజాన మోస్తున్నామని అన్నారు. శ్రీనివాస కల్యాణ పథకాన్ని తాను సొంత డబ్బులతో చేపట్టానని, తన కంటే మెరుగైన పథకాలను చేపట్టండని అధికార పార్టీకి సవాల్ విసిరారు. కేంద్ర ప్రభుత్వం సంక్షేమాన్ని గాలికి వదిలేసిందన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాదిల శ్రీనివాస్, ఎంపీటీసీ రత్నకుమారి, చలపతిరావు, నాయకులు మోతిబాలు, వెంకటయ్య, రవీందర్‌రెడ్డి, తులారాంసింగ్, భీమానాయక్, భీక్లానాయక్, బాలునాయక్, రవినాయక్, సైదాచారి, మధుసూదన్‌రెడ్డి, భిక్షపతి, మధుయాదవ్, లక్పతినాయక్, సర్పంచులు, ఎంపీటీసీలు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వాలు విఫలం


ప్రచారయాత్రలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి

దేవరకొండ: ఎన్నికలకు ముందు ప్రజలకిచ్చిన హామీల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా సమగ్రాభివృద్ధికై సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార యాత్ర సోమవారం దేవరకొండ మండల పరిధిలోని మైనంపల్లి, కొర్రతండా, మర్రిచెట్టుతండా, దుబ్బతండా, మడమడక, శాకెల్లి, అంబటోని గూడెం మీదుగా కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులకు అవసరమైన నిధులను కేటాయించి వాటిని వెంటనే పూర్తిచేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన సమాఖ్య రాష్ట్ర నాయకుడు రమావత్ అంజయ్యనాయక్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, వెంకటరమణ, ఎండీ మైనొద్దీన్, కనకాచారి, వెంకటయ్య, నూనె రామస్వామి, శైలేష్, కిన్నెర యాదయ్య, వెంకటేశ్వర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

ప్రజలను రెచ్చగొట్టేలా ప్రసంగించడం సరికాదు


మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రవినాయక్

మిర్యాలగూడ అర్బన్: భారతదేశంలో రిజర్వేషన్ల వ్యవస్థ రాజ్యాంగం ప్రకారం నడుస్తుందని, ముస్లింలకు రిజర్వేషన్ తొలగిస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రెచ్చగొట్టే ప్రసంగాలు చేయడం సరికాదని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ముడావత్ రవినాయక్ అన్నారు. సోమవారం మిర్యాలగూడ పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. దేశంలో ముస్లింలకు మత ప్రాతిపదికన రిజరేషన్లు ఇవ్వడంలేదని, ఆర్థికంగా, సామాజికంగా, విద్యాపరంగా వారి వెనుకబాటుతనాన్ని గుర్తించి వారికి రిజర్వేషన్లు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా రంగనాథ్ మిశ్రా కమిషన్, జస్టిస్ సచార్ కమిటీ, అమితాబ్ కందు కమిటీ స్పష్టంగా ముస్లింలు ఎస్సీ, ఎస్టీల కన్నా ఎంతో వెనుకబడి ఉన్నారని తెలిపారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ముస్లింలకు 5శాతం రిజర్వేషన్ కల్పించిన సమయంలోనూ బీజేపీ నాయకులు నానా రభస చేశారని గుర్తు చేశారు. కేంద్ర వైఫల్యాలను కప్పి పుచ్చుకోవడం కోసం ముస్లిం రిజర్వేషన్లను తెరమీదకు తెచ్చారని విమర్శించారు. మత రాజకీయాలకు వ్యతిరేకంగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు. ఆయన వెంట నాయకులు పఠాని శ్రీను, బాబునాయక్, నాగేంద్ర ప్రసాద్, పల్లా భిక్షం తదితరులున్నారు.

డిండి మండలంలో వడగండ్ల వాన


కె.గౌరారం గ్రామ శివారులో వ్యవసాయ పొలంలో పడిన వడగండ్లు

డిండి: మండల పరిధిలోని ఎర్రారం, కె.గౌరారం, టి.గౌరారం, ఖానాపూర్, బొల్లనపల్లి గ్రామపంచాయతీల పరిధిలో సోమవారం ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వాన కురిసింది. దీంతో డిండి ప్రాజెక్టు ఆయకట్టు కింద వందల ఎకరాల్లో సాగుచేసిన వరి పంట దెబ్బతిని తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట నష్టపోయిన రైతులను గుర్తించి ప్రభుత్వమే ఆదుకోవాలని సంబంధిత జిల్లా ఉన్నతాధికారులను కోరారు.

సమీకృత కార్యాచరణ ప్రణాళికపై అవగాహన

పెద్దవూర: ఐసీడీఎస్ అనుముల ప్రాజెక్టు పరిధిలోని పెద్దవూర మండలానికి సంబంధించిన సమీకృత కార్యాచరణ ప్రణాళిక(సీఏపీ)పై సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో అధికారులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల సీఏపీ చైర్మన్‌గా తహసీల్దార్ సురిగి సైదులుగౌడ్, వైస్ చైర్‌పర్సన్‌గా ఎంపీడీఓ కూస్‌రెడ్డి విజయాకుమారి వ్యవహరిస్తూ సీఏపీ ఉద్దేశాలు, లక్ష్యాలను వివరించారు. ఈ సందర్భంగా సీఏపీ చైర్మన్ మాట్లాడుతూ.. ఐదు సంవత్సరాలలోపు పిల్లల్లో వయస్సుకు తగ్గ ఎత్తు, బరువు లేకపోవడాన్ని నివారించడం, కౌమార దశలో, గర్భిణులు, బాలింతల్లో రక్తహీనతను తగ్గించడం సీఏపీ ఉద్దేశమని అన్నారు. సీఏపీ కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేసి సీఏపీ లక్ష్యసాధనకు కృషి చేయాలని సూచించారు. సమావేశంలో సీడీపీఓ గంధం పద్మావతి, ఏసీడీపీఓ సువర్ణ, మండల వైద్యాధికారి నగేష్, ఏపీఎం విజయ్‌కుమార్, పీఆర్ ఏఈ రామకృష్ణ, ఏపీఓ యాట వెంకటేశ్వర్లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కమలాబాయి, గౌసియా తదితరులు పాల్గొన్నారు.

వేముల రాంరెడ్డికి ఘన నివాళి

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన వేముల రాంరెడ్డి ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్ పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, ముడావత్ రవినాయక్, మల్లు గౌతంరెడ్డి, గాదె పద్మ, సత్యనారాయణరావు తదితరులున్నారు.


వేముల రాంరెడ్డి ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న సీపీఎం నాయకులు

మారుతున్న ప్రభుత్వ బడుల రూపురేఖలు

- దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్రకుమార్


మౌలిక సదుపాయాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్

చందంపేట: మన ఊరు-మన బడితో రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుతున్నాయని దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. చందంపేట మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో మన ఊరు-మన బడి మొదటి విడత కింద రూ.69లక్షలతో చేపట్టిన మౌలిక సదుపాయాలను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేసి పేద, మధ్య తరగతి విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నూన్సావత్ పార్వతిచందు నాయక్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు దొండేటి మల్లారెడ్డి, ముత్యాల సర్వయ్య, సర్పంచ్ గోసుల కవితాఅనంతగిరి, శ్రీనివాస్‌గౌడ్, మోహన్‌కృష్ణ, సైదులు, హాజి, ఎంపీటీసీ మల్లయ్య, గోసుల శివ, సురేష్, ఎంఈఓ సామ్యానాయక్, పీఆర్ ఏఈఈ రాజు, హెచ్ఎంలు చంద్రశేఖర్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య తెలంగాణ నిర్మాణమే లక్ష్యం

- నాగార్జునసాగర్ ఎమ్మెల్యే భగత్


పీహెచ్‌సీలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే భగత్

హాలియా: ఆరోగ్య తెలంగాణ నిర్మానమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ కృషిచేస్తున్నారని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. హాలియా పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రూ.3.3కోట్లతో ఏరియా ఆస్పత్రిగా అభివృద్ధి చేసేందుకు గాను సోమవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి మాట్లాడారు. ప్రజలకు అత్యవసర వైద్య సేవలు మరింత చేరువ చేసేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, మున్సిపల్ చైర్‌పర్సన్ వెంపటి పార్వతమ్మశంకరయ్య, హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ జవ్వాజి వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు చెరుపల్లి ముత్యాలు, కౌన్సిలర్లు నల్లబోతు వెంకటయ్య, ప్రసాద్ నాయక్, కోఆప్షన్ సభ్యుడు చాపల సైదులు, నాయకులు పిల్లి ఆంజనేయులు, సైదాచారి, రావులపాటి ఎల్లయ్య, జింకల హరిప్రసాద్, పెరుమాళ్ల రాంబాబు, వైద్యాధికారి అఖిల్, డీఈ, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ప్లీనరీని విజయవంతం చేయాలి

- మిర్యాలగూడ ఎమ్మెల్యే భాస్కర్‌రావు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ: బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఆదేశానుసారం పట్టణంలోని నందిపాడు శ్రీమన్నారాయణ గార్డెన్స్‌లో మంగళవారం నిర్వహించనున్న నియోజకవర్గస్థాయి పార్టీ ప్లీనరీ సమావేశాన్ని విజయవంతం చేయాలని మిర్యాలగూడ ఎమ్మెల్యే భాస్కర్‌రావు పిలుపునిచ్చారు. సోమవారం ఆయన మిర్యాలగూడ పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్లీనరీలో 10 తీర్మానాలు ప్రవేపెట్టనున్నట్లు తెలిపారు. తీర్మానాలను బలపరిచి పార్టీ కేంద్ర కార్యాలయానికి పంపించనున్నట్లు పేర్కొన్నారు. అన్ని గ్రామాల్లో, వార్డుల్లో గ్రామ పార్టీ అధ్యక్షులందరూ ఉదయం పార్టీ జెండా ఎగురవేసి ప్లీనరీకి చేరుకోవాలని సూచించారు. ప్లీనరీకి బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

బస్తాకు రూపాయి ఇస్తేనే.. లారీ వచ్చేది!

- కొనుగోలు కేంద్రాల్లో అవస్థలు పడుతున్న రైతులు


చిరుమర్తి ఐకేపీ కేంద్రంలో కాంటా వేసిన ధాన్యం బస్తాలు

మాడుగులపల్లి: ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు అన్నదాతలు అష్టకష్టాలు పడుతున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనూ రైతులకు అవస్థలు తప్పడం లేదు. మండలంలోని కొన్ని కేంద్రాల్లో ధాన్యం పోసి నెలరోజులు గడుస్తున్నా కాంటాల్లో జాప్యం జరుగుతుండగా.. పలుచోట్ల కాంటా వేసిన ధాన్యం బస్తాలు తరలించేందుకు సకాలంలో లారీలు అందుబాటులో లేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. చిరుమర్తి గ్రామంలోని ఐకేపీ కేంద్రం నుంచి ధాన్యం బస్తాలు తరలించేందుకు లారీ డ్రైవర్లు డబ్బులు డిమాండ్ చేసినట్లు నిర్వాహకులు ఆరోపిస్తున్నారు. ఈ నెల 21న 960 బస్తాల తడిసిన ధాన్యం కాంటా వేయగా బస్తాకు రూపాయి చొప్పున చెల్లిస్తేనే తరలిస్తామని చెప్పడంతో చేసేది లేక చెల్లించినట్లు తెలిపారు. సోమవారం 1500 బస్తాలు కాంటా వేసినా లారీలు రాకపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. కాంట్రాక్టర్లు లారీలను పంపడంలో దారుణంగా వ్యవహరిస్తున్నారని, ఇదేమని ప్రశ్నిస్తే దిగుమతులు కావడం లేదంటూ సమాధానం చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని పీఏసీఎస్ కేంద్రాల్లో లారీకి రూ.1000 చెల్లిస్తున్నారని, దాంతో లారీ డ్రైవర్లు ఇక్కడికి వచ్చేందుకు నిరాకరిస్తున్నట్లు నిర్వాహకులు ఆరోపిస్తున్నారు. అకాల వర్షాలు కురుస్తున్న సమయంలో కాంటా వేసిన బస్తాలు కేంద్రాల్లోనే ఉండిపోతుండడంతో అటు రైతులు.. ఇటు నిర్వాహకులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విషయంపై సివిల్ సప్లయ్ ఉన్నతాధికారులను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఫోన్‌లో అందుబాటులోకి రాలేదు.

ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

మిర్యాలగూడ టౌన్: పట్టణంలోని మిర్యాలగూడ హైస్కూల్(తెలుగు మీడియం)లో 1999–2000 బ్యాచ్ పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు సోమవారం పట్టణంలో వైష్ణవి గ్రాండ్ హోటల్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్నారు. 23 ఏళ్ల తర్వాత స్నేహితులంతా ఒక చోట కలిసి ఆనాటి తీపి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా తమకు చదువు నేర్పిన గురువులు తెల్ల ధనుంజయ, దేవిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, చాపల శ్రీనివాస్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తౌఫిక్, లక్ష్మణ్, లోకేష్, ప్రకాశ్, కొడిరెక్క నాగేందర్, అనిల్, ముత్యాల నాగేందర్, ప్రభాకర్, వాసు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

కంటి వెలుగు శిబిరం ప్రారంభం

మాడుగులపల్లి: మండలంలోని కల్వలపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని సోమవారం సర్పంచ్ గడ్డమీది సైదులుతో కలిసి ఎంపీపీ పోకల శ్రీవిద్యరాజు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జితేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్, బీఆర్ఎస్ నాయకులు చొక్కారావు, కేసాని పూర్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు సృష్టిస్తే చర్యలు తప్పవు

మిర్యాలగూడ అర్బన్: విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఆర్టిజన్లు మంగళవారం నుంచి సమ్మె చేస్తున్నట్లు నోటీసులు ఇచ్చారని, సమ్మెలో భాగంగా దేవరకొండ డివిజన్ పరిధిలోని విద్యుత్ సబ్ స్టేషన్లలో సదరు ఉద్యోగులు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగేలా చేస్తే స్థానికులు వెంటనే సమాచారం అందించాలని ట్రాన్స్‌కో డీఈ వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమ్మె చేసే కార్మికులపై ఇప్పటికే ప్రభుత్వం ఎస్మా చట్టం అమల్లోకి తెచ్చిందని, విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆట వస్తువులు అందజేత

కొండమల్లేపల్లి: మండలంలోని చింతకుంట్లలో గల అంగన్‌వాడీ కేంద్రానికి, ప్రాథమిక పాఠశాలకు సోమవారం ఉప సర్పంచ్ యేకుల సురేష్, అనిత దంపతులు ఆట వస్తువులు, అక్షరమాల చార్ట్‌లు అందజేశారు. కార్యక్రమంలో సీడీపీఓ సరళ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాధ, యేకుల సామేల్, ఎడ్ల సంతోష, టీచర్లు శ్రీనివాస్, మనమ్మ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరణ

దేవరకొండ: నల్లగొండలో ఈ నెల 28న నిర్వహించనున్న జ్యోతిబాపూలే అంబేడ్కర్ జన జాతరను విజయవంతం చేయాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీను, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. సోమవారం దేవరకొండలో కేవీపీఎస్, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జన జాతరకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో పెరికె విజయ్‌కుమార్, నల్ల వెంకటయ్య, నల్ల రామస్వామి, బిజిలి లింగయ్య తదితరులున్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

మిర్యాలగూడ: ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాని మాజీ ఎమ్మెల్యే రేపాల శ్రీనివాస్ అన్నారు. సోమవారం మిర్యాలగూడ మండలంలోని అవంతీపురం వ్యవసాయ మార్కెట్ యార్డును ఆయన సందర్శించి మాట్లాడారు. నెల రోజులు నుంచే రైతులు మార్కెట్‌కు ధాన్యం తీసుకొచ్చినా కొనుగోళ్లు మాత్రం మందకొండిగా సాగుతున్నాయన్నారు. ప్రభుత్వం స్పందించి ధాన్యం కాంటాలు నిర్వహించాలని లేదంటే రైతులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయం వద్ద సమ్మె చేస్తున్న వీఓఏలకు ఆయన మద్దతు తెలిపారు.

రెగ్యులరైజ్ చేయాలని వినతి

దేవరకొండ: తమను ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ సోమవారం దేవరకొండ మండల పరిధిలోని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ఎంపీపీ నల్లగాసు జాన్‌యాదవ్‌కు వినతిపత్రం అందజేశారు. అవుట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను జేపీఎస్‌లుగా ప్రమోట్ చేయాలని కోరారు. అనంతరం సీఎం కేసీఆర్‌కు పోస్టుకార్డులు పంపి సమస్యలను విన్నవించారు. కార్యక్రమంలో జేపీఎస్‌లు వెంకటేష్, శంకర్, శ్రీను, రమేష్ తదితరులున్నారు.

రాజ్యాంగ ప్రతుల పంపిణీ

మిర్యాలగూడ టౌన్: మండలం ఉట్లపల్లి ప్రభుత్వ హైస్కూల్‌లో సోమవారం ప్రజాస్వామ్య పరిరక్షణ సేవా సమితి ఆధ్వర్యంలో రాజ్యాంగ ప్రతులను సామాజికవేత్త డాక్టర్ జాడీ రాజు, సేవా సమితి అధ్యక్షుడు పాశం నరేష్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ తక్కెళ్లపల్లి శ్రీనివాస్ పంపిణీ చేశారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం తిరుపతినాయక్, సేవా సమితి ఉపాధ్యక్షుడు చింతగిరి చైతన్య, ఎమ్మార్పీఎస్ నాయకుడు పుట్టల సందీప్, విద్యావంతుడు బొప్పిడి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ రైతు విభాగం కార్యదర్శి పిన్నం యాదగిరి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బొంగరాల కిరణ్, మద్దిలేటి అంజయ్య తదితరులున్నారు.